



ఓవర్ లోడ్ కారణంగా తెనాలి వైకుంఠపురం బ్రిడ్జి వద్ద రోడ్డుపై పడి ప్రమాదకరంగా మారిన ఇసుక

మార్చిలోనే మంటలు



- మొదలైన భానుడి ప్రతాపం
- 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మే నెలను తలపించేలా ఎండలు
- ఉదయం 9 నుంచే వేడి.. జనం ఉక్కిరిబిక్కిరి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మార్చి రెండో వారంలోనే భానుడు ప్రతాపం చూపుతు న్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతు న్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులకు మాత్రమే ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వస్తున్నారు. రానున్న వారం రోజులు ఇదేస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. సాధారణ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు కాగా 7 డిగ్రీలు అధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాలలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోద య్యాయి. గుంటూరు జిల్లాలో అత్యధికంగా 41 డిగ్రీలు, బాపట్ల జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



గురువారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
రెంటచింతల	42
మాచర్ల	42
గురజాల	42
దాచేపల్లి	42
నరసరావుపేట	42
పిడుగురాళ్ళ	42
వినుకొండ	42
సత్తెనపల్లి	41
చిలకలూరిపేట	40
గుంటూరు	41
మంగళగిరి	41
తాడేపల్లి	41
తెనాలి	39
బాపట్ల	37
చీరాల	37
రేపల్లె	33

జాగ్రత్తలు తీసుకోవాలి..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయ టకు వెళ్లే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు నీటిని ఎక్కువగా తాగాలని, రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిదంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎండలో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మజ్జిగ కొబ్బరి నీళ్ల పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచి స్తున్నారు. ద్విచ క్ర వాహనంపై ఎక్కు వ దూరం ప్రయా ణించ రాదన్నారు.



మరమ్మతుల కోసం ఫ్రిజ్‌లను తరలిస్తున్న దృశ్యం

ఉచితం.. అనుచితం

ఇష్టారీతిన ఇసుక వినియోగం

- తక్కువ ధరకు వస్తుందని వెంచర్ల మెరకలకూ..
- పరిమితికి మించి లోడింగ్‌తో రోడ్లపై జారిపోతున్న ఇసుక
- ఇసుక మయంగా మారిన రహదారులపై నిత్యం ప్రమాదాలు
- టీడీపీ ప్రభుత్వంలో దుర్వినియోగం చేసిన వారిపై కేసులు
- అధికారుల నిర్లక్ష్యం.. రీచ్‌ల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు

బంగారంలాంటి ఇసుక వృథా అవుతోంది. ఉచితం పేరుతో కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఇసుకను కొందరు దుర్వినియోగం చేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.వేలకు వేలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇసుక ఇప్పుడు అందుబాటు ధరలో లభిస్తుండటంతో ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కారణంగా నిర్మాణదారులు పడిన కష్టాలు తీర్చేందు కోసం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి సామాన్యులకు సైతం అందుబాటులో ధర ఉండేలా చేస్తే కొందరు దానికి విలువ లేకుండా చేస్తున్నారు. తక్కువ ధరకే ఇసుక లభిస్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తున్నారు. రియల్టర్లు వెంచర్లను మట్టికి బదులు ఇసుకతో మెరక చేసుకుంటున్నారు. వాహనదారులు పరిమితికి మించి ఇసుకను నింపుకుని వెళ్తుండటంతో అదంతా జారిపోయి రోడ్లన్నీ ఇసుకతో నిండిపోతున్నాయి. ఈ ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఇసుక దుర్వినియోగం అవుతున్నా.. వృథాగా రోడ్డు పాలవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుకను దుర్వినియోగం, వృథా చేసిన వారిపై కేసులు నమోదు చేయగా ప్రస్తుతం ఆ ఊసే ఎక్కడా కనిపించడం లేదు.



ఉచిత ఇసుకతో ప్లాట్ల మెరక

తెనాలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఇసుక కష్టాలతో నిర్మాణ దారులు అల్లాడిపోయారు. ఇసుక అందు బాటులో లేక కూలీలకు పనులు కూడా దొరకలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసి నిర్మాణ దారులకు ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంది. భవన నిర్మాణాలకు ఇసుక కావాలంటే గత వైసీపీ ప్రభుత్వం లో రూ.లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఉంటే ప్రస్తుతం కేవలం నామమాత్రపు కూలి ఖర్చులు చెల్లించి, సీనరేజ్ లేకుండా అందుతోంది. గతానుభవాల దృష్ట్యా ఇసుక ను జాగ్రత్తగా వాడుకోవాలి. అయితే కొం దరు దానిని దుర్విని యోగం చేస్తుండగా.. మరికొందరి నిర్లక్ష్యం కారణంగా వృథా అవుతోంది. తక్కువ ధరకే ఇసుక లభి స్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తు న్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు పలికింది. ఇప్పుడు అదే ఇసుక రూ.6 వేల నుంచి రూ.9 వేలలోపు వచ్చే స్తుండటంతో దానికి విలువ లేకుండా పో యింది. సాధారణంగా రియల్టర్లు వెంచర్ల మెరక కోసం ఎర్రమట్టి లేక బుసక మన్ను ను వినియోగిస్తుంటారు. అయితే మట్టి, బుసక ధరకే ఇసుక వస్తుండటంతో దాని నే మెరకకు వాడుతున్నారు. దీంతో బం గారం లాంటి ఇసుక కట్టడాలకు ఉపయో గపడకపోగా, భూగర్భంలో కప్పబడిపో తోంది. అనుచితంగా ఉపయోగించేస్తుండ టంతో భవిష్యత్‌లో కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.


వాల్టా ఉల్టా

రీచ్‌ల్లో కూలీలతో వాహనాలకు ఇసుకను లోడ్ చేయాల్సిన కాంట్రాక్టర్లు లారీలను నేరుగా నదిలోకి దింపేసి ఎక్స్‌కవేటర్లతో తోడి పోసేస్తు న్నారు. వాల్టా చట్టం ఉల్టా అవుతుండగా గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు నదిలో కలసిపోతున్నాయి. అయినా అధికారులు రీచ్‌ల వైపు కన్నెత్తి చూడటంలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారనుకుంటే, ఇప్పుడు వాటికి మించి ఉల్లంఘ నలు జరుగుతున్నాయి. నదిలోని నీరు బయటకు వచ్చేలా పది నుంచి 15 అడుగుల వరకు లోతుపెట్టి తవ్వేస్తున్నారు. దీంతో నదీ తీర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి వేసవి మొదలు కాకముందే నీటికి కటకట ఏర్పడుతోంది.

వృథాతో పాటు ప్రమాదాలు

ప్రకాశం బ్యారేజి దిగువన గుండిమెడ, పెదకొండూరు, అత్త లూరివారిపాలెం, బొ మ్మువానిపాలెం రీచ్ లు గడువు ముగిసి మూతపడగా ప్రస్తుతం గాజుల్లంక రీచ్‌కు ఒక్క దానికే అనుమతులు

(మిగతా 4వ పేజీలో)



ఓవర్ లోడ్‌తో ఇసుక లారీ

కాసులిస్తే.. కావల్సినంత

నదిలోని ఇసుకను కూలీలతో ట్రాక్టర్లకు లోడ్ చేయించి ఒడ్డుకు తీసుకొచ్చి నిల్వ పోసి ఎక్స్‌కవేటర్‌తో లారీల్లో నింపాలనేది నిబంధన. ఇలాగైతే ఇసుకను పరిమితికి మించి పోయకుండా కొలత ప్రకారం పోసి డబ్బు తీసుకునేవారు. కానీ కూలీలతో పనిలేకుండా భారీ యంత్రాలను నేరుగా నదిలోకే దింపేసి, ఇసుకను ఇష్టమొచ్చినట్లు పోస్తున్నారు. అది ఎంతగా అంటే మార్గమధ్యలో లారీల నుంచి రోడ్లపైకి కారిపోయేటంత. ఆరు చక్రాల లారీకి 18 టన్నులు, 10 చక్రాల లారీకి 24 టన్నుల వరకు అనుమతిస్తుంటే, 6 చక్రాల లారీలో 25 నుంచి 30 టన్నుల వరకు, 10 చక్రాల లారీలో 40 టన్నుల వరకు, ఇక 12 చక్రాల లారీల్లో అయితే 40 నుంచి 60 టన్నులపైనే ఇసుక పోసేస్తున్నారు. అదనంగా పోసిన ఇసుకకు అదనంగా డబ్బు దోచే స్తున్నారు.

వాటర్‌గ్రిడ్.. టెండర్ ఖరారు

- నిర్మాణ వ్యయం రూ.1,200 కోట్లు
- తొలివిడతలో 10 మండలాలకు అమలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడువాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా వాటర్‌గ్రిడ్ తొలివిడత పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రూ.1,200 కోట్ల వ్యయంతో చేపట్టే గ్రిడ్ పనుల టెండర్‌ను నాగార్జున నిర్మాణ సంస్థ(ఎన్‌సీసీ) దక్కించుకుంది. పనులకు సబంధించిన అగ్రిమెంట్ 21న పూర్తి అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద వాటర్‌గ్రిడ్‌కు నిధులు విడుదలయ్యాయి. వైసీపీ హయాంలో ఈ పథకాన్ని అటకెక్కిం చగా తాజాగా కూటమి ప్రభుత్వం పనులను పట్టాలెక్కిస్తోంది. చేతిపంపులు, బావుల ద్వారా తాగునీటి సరఫరాను నిలిపివేసి కృష్ణా నదీ జలాలను ప్రతి ఇంటికి అందించాలన్నదే వాటర్‌గ్రిడ్ లక్ష్యం. తొలివిడతలో 10 మండలాల్లోని 325 గ్రామాలకు వాటర్‌గ్రిడ్‌ను అమలు చేయనున్నారు. మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, దుర్గి, కారం పూడి, గురజాల, మాచవరం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లం కొండ మండలాలకు అమలు చేస్తున్నారు. విజయపూరిసౌత్ హిల్‌కాలనీ సమీపంలో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మిస్తారు. ప్లాంట్‌కు నీటిని సాగర్ బ్యాక్ వాటర్‌ను ఇన్‌టేక్ వెల్ ద్వారా సరఫరా చేస్తారు. సాగర్ నుంచి నేరుగా సంవత్సరం పొడవునా నీటిని విని యో గించుకునేలా పథకాన్ని నిర్మిస్తున్నారు. నీటి శుద్ధి ప్లాంట్ నుంచి పైపులైన్‌ను నిర్మించి 325 గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు గ్రావిటీ ద్వారా నీటిని ఎక్కిస్తారు. మరో ఏడాదిలో రెం డో విడతలో 18 మండలాల్లోని 468 గ్రామా లకు వాటర్ గ్రిడ్‌ను అందుబాటు లోకి తెచ్చే లా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు రూ.2,200 కోట్లు వ్యయంగా అంచనా వేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (శుక్రవారం)


సహరి : 5.00 (శనివారం)

వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

జిల్లా పరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రూ.3.87 కోట్లతో కార్యాచరణ ప్రణాళికను ఆర్‌డబ్ల్యూ ఎస్ రూపొందించింది. తాగునీటి ఎద్దడి గ్రామాల పరిధిలోని చెరువులను నింపేం దుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 44 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా 43,948 ట్రిప్‌లు అవసరమని అంచనా వేశారు. బొల్లాపల్లి మండలంలో 16 గ్రామాలు, చిలకలూరిపే టలో రెండు, దాచేపల్లి 4, దుర్గి 5, యడ్లపాడు 5, మాచవరం 4, మాచర్ల 5, నాదెండ్ల 5, వెల్దుర్తి 13, రెంటచింతల మండలంలోని 3 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుందని గుర్తించారు. 120 బోర్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు.



బోరు ద్వారా నీటి సరఫరా



ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత మాణిక్యవేల్ కన్నుమూత

4

శ్రీవారి కల్యాణంతో అమరావతి పునర్నిర్మాణం

- 27 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 300 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు - 3 వేల వాహనాలకు పార్కింగ్
- ఆలయ ప్రాంగణం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి



తుళ్లూరు : వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి కల్యాణానికి కుర్చీలు వేసి సిద్ధం చేసిన ఆవరణ

4



వెంకటపాలెం ఆలయ ఆవరణలో శ్రీవారి కల్యాణానికి సిద్ధమైన వేదిక

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

- పురుడు పోసుకుంటున్న అమరావతి ఐకానిక్ ప్రాజెక్టు
- కీలక ప్రాజెక్టుపై తాజాగా అసెంబ్లీలో మంత్రి నిమ్మల ప్రకటన
- గత ప్రభుత్వంలో ఐకానిక్ బ్రిడ్జిలకు చంద్రబాబు శంకుస్థాపన
- ఉద్దేశపూర్వకంగా జగన్ ప్రభుత్వం నాడు రద్దు.. నేడు పెరిగిన నిర్మాణ వ్యయం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి, అమరావతి)

రాజధానికి గేట్ వేగా.. అమరావతివాసు లకు తాగునీటి వనరుగా.. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రంగా.. వరదనీరు సముద్రంలోకి వృథాగా పోకుండా.. కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద గత టీడీపీ ప్రభుత్వం నిర్మించాలనుకున్న బ్యారేజి ఎట్టకేలకు పట్టాలెక్కనున్నది. అత్యద్భుత అమరావతి.. భావి అవసరాలు.. రాష్ట్రాభివృద్ధి ప్రణాళికల నేపథ్యంలో నాడు చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిన కీలక ప్రాజెక్టులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణానదిపై వైకుం ఠపురం వద్ద బ్యారేజి కమ్ బ్రిడ్జిని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం ప్రతిపా దించింది. దీంతో 2019 ఫిబ్రవరి 13న ఇప్పటి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పవిత్రసంగమం(ఫెర్రీ)-గుంటూరు జి ల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెం గ్రామాల మధ్య ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థా పన చేశారు. నవయుగ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధాని అమరావతితో పాటు ఈ బ్యారేజి నిర్మాణాన్ని కూడా ఉద్దేశపూర్వకంగా రద్దు చేసి అటకెక్కించిం ది. ఇంతటి కీలక ప్రాజెక్టుపై తాజాగా కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వైకుంఠపురం బ్యారే జి నిర్మాణంపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో జ లవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. బ్యారే జి విషయంలో అన్ని అ నుమతులను సాధించి టెండర్లను పిలిచి పనుల ను కూడా కొంతమేర ఆరం భించామని గుర్తుచేశారు. బ్యారేజీ నిర్మాణాన్ని పట్టాలెక్కిం చేందుకు కొత్తగా డీపీఆర్‌ను తయారు చేయనున్నట్లు ప్రకటించారు. 15 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకునే లా బ్యారేజిని నిర్మించాలనుకుంటున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. నవ్య రాజధా ని అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందు కు వేస్తున్న క్రమంలో ఈ బ్యారేజి అంశం తెరపైకి రావడంతో రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాడు రూ.2,400 కోట్లు.. నేడు రూ.4 వేల కోట్లు

ఆరేళ్ల జాప్యం జరుగుతున్న కారణంగా బ్యారే జి నిర్మాణఖర్చు తడిసి మోపెడవనున్నది. ఇంచు మించే ఈ వ్యయం యాభైశాతాన్ని మించిపోయే అవ కాశం ఉంది. జగన్ నిర్వాకం కారణంగా ఈ అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రజలు మోయక తప్పని పరిస్థితు లు ఉత్పన్నమయ్యాయి. గతంలో రూ.2,400 కోట్ల తో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు రూ.4 వే ల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుం దని అంచనా వేస్తున్నారు.

నిర్మాణం జరిగితే ఎంతో మేలు..

రాజధాని అమరావతికి గేట్ వేగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై తలపెట్టిన ఐకానిక్ బ్రిడ్జి ప్రకాశం బ్యారేజీకి ఎగువన 23 కి.మీ, అమరావతికి దిగువన 7కి.మీ దూరంలో

(మిగతా 4వ పేజీలో)



ఐకానిక్ బ్రిడ్జి ఊహాచిత్రం



2019లో బ్యారేజీకి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు



విద్యుత్ వెలుగుల్లో వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

స్వామివారి కల్యాణంతో

అమరావతి పునర్నిర్మాణం

- 27 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 300 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు .. 3వేల వాహనాలకు పార్కింగ్
- ఆలయ ప్రాంగణం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తుళ్లూరు (వెంకటపాలెం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతం వెంకటపాలెం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఈ నెల 15న వైభవంగా నిర్వహిస్తున్నామని, అందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఏర్పాటుచేసిన మీడియా మావేశంలో ఆయన ఈవో శ్యామలరావుతో కల సి మాట్లాడారు. స్వామివారి ఆలయ ఆవరణలో ఈనెల 15న సాయంత్రం 6.30 గంటలనుంచి రాత్రి 8.30వరకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు శ్రీనివాస కల్యాణం అనంతరం స్వామివారి దివ్య ఆశీస్సులతో అమరావతి పునర్నిర్మాణానికి ఏర్పాటు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా గురువారం అమరావతి రైతులు, రైతుసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ, శ్రీనివాస కల్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ఏర్పాట్ల గురించి వివరిస్తూ.. కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల నుండి అర్చక స్వాములు, వేద పండితులు, వారితో పాటు మంగళధ్వని అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

హాల్‌టిక్కెట్‌తో పది విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పది విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టిక్కెట్టు బస్సు టిక్కెట్‌తో సమానమని పేర్కొన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం క ల్పించినట్లు తెలిపారు. పరీక్షల సమయాల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వం.. నృసింహుని కల్యాణం

- శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి లోకేశ్ దంపతులు
- నేడు మంగళగిరి తిరునాళ్లు

మంగళగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి కల్యాణం సాక్షాత్తూ అపర వైకుంఠాన్ని తలపింపజేసింది. జై నారసింహా...జైజై నారసింహ అనే భక్తుల జేజేలు, మేళతాళాలు, వేదపండితులు, అర్చకస్వాములు, పారాయణీకుల వేదఘోష నడుమ శ్రీలక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవం శుక్రవారం వేకువజామున అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ క్రోధినామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ చతుర్దశి ఘడియల్లో శ్రీ నృసింహుడు అమ్మవార్ల మెడలో మాంగల్య ధారణ చేసే ఘట్టాన్ని అర్చకులు, వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన నృసింహుని కల్యాణాన్ని తిలకించి భక్తకోటి పులకించింది. సర్వ పరిమళాలను వెదజల్లుతూ సకల పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న కల్యాణ మండపంపై వేదపండితుల పౌరోహిత్యంలో సర్వమంగళ వాయిద్యాల నడుమ నృసింహుని కల్యాణం వైఖానస ఆగమ శాస్త్రానుసారం జరిగింది. శ్రీస్వామివార్ల కళ్యాణోత్సవానికి స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ తన సతీమణి బ్రాహ్మణితో కలిసి వచ్చి వ్యక్తిగతంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను శ్రీస్వామివార్లకు సమర్పించారు.

కల్యాణోత్సవంలో సంప్రదాయంగా గురువారం రాత్రి అందాల నృసింహుడు పెండ్లి కుమారుని శోభలో చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవానికి వెళ్లివస్తూ ఉత్సవ గ్రౌం డు సమీపంలో పుష్పక విమానంపై తనకు ఎదురొచ్చి న నూతన పెండ్లి కుమార్తెలైన శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లతో ఎదురుకోల ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉ త్సవం అనంతరం అర్ధరాత్రి కావొస్తుండగా వేర్వేరు రథాలపై బ్యాండు మేళాలు, కోలాట నృత్యాల నడుమ నృసింహస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకస్వాములు కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. ఆ తదుపరి అర్చకస్వాములు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేసి మండప సంప్రోక్షణ చేశారు.. ఈ మండపశుద్ధి తరువాత అష్టదిక్పాలకులను ఆవాహన గావించారు.

వైఖానస స్తోత్రాల వేదపఠనం, మంగళవాయిద్యాలు, భక్తజనుల గోవింద నామస్మరణలతో మండప ప్రాంగణం మార్మోగుతుండగా.. కల్యాణ యాజ్ఞీకుని హోదాలో దీవి తిరుమల సత్య ప్రసాద్ ఉత్సవ మూర్తులను పెళ్లిపీటలపై ఆశీనులను గా వించారు. వివాహ తంతు ఆరంభమయ్యేటప్పటికి గురువారం అర్ధరాత్రి దాటి శుక్రవారం వేకువజాము 12 గంటలు అయింది. ఈ కల్యాణాన్ని తిలకించిన మహిళలందరికీ జన్మజన్మలకు సువాసినీ జన్మ కలగాలని కోరుతూ అర్చకస్వాములు మాంగల్య పూజను నిర్వహించారు. అనంతరం తెల్లవారుజాము మూడున్నర గంటల సమయంలో భక్తజనుల కరతాళ ధ్వనులు... వేదఘోష మధ్య లోకకల్యాణార్థం స్వామివారి తరపున అర్చకస్వాములు అమ్మవార్లకు మాంగల్యధారణ చేశారు. ఆ వెంటనే శ్రీస్వామి వారికి యజ్ఞోపవీత ధారణ గావించారు. తొలుత కల్యాణాన్ని పురస్కరించుకుని స్థానిక శాసన సభ్యులు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీసమేతంగా హాజరై శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. శ్రీస్వామివారి తరపున శేకూరు గ్రామ వాస్తవ్యులు వాసిరెడ్డి జయదత్తు, ప్రభునాద్... అమ్మవార్ల తరపున మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధి అవ్వారు శరత్‌బాబు మధుపర్కాలు, మంగళద్రవ్యాలను సమర్పించారు. చివరిగా అక్షతారోపణను జరిపించారు. భక్తులు ఈ కల్యాణ అక్షితలను మిక్కిలి భక్తి ప్రపత్తులతో స్వీకరించి తరించారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, తిరువీధుల కిరణ్, మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల మోహన్ తదితరులు కల్యాణోత్సవానికి హాజరై అమ్మవారికి తమ సంఘం తరపున పట్టువస్త్రాలు, మంగళసూత్రాలను సమర్పించారు.



స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఈవో కోటిరెడ్డి, ఆలయప్రధాన అర్చకులు, పద్మశాలీయ సంఘం ప్రతినిధులు

నేడు మంగళగిరి తిరునాళ్ల

తెలుగునాట సుప్రసిద్ధమైన మంగళగిరి తిరునాళ్ల శుక్రవారం జరుగనుంది. నృసింహుని దివ్యరథోత్సవాన్ని మంగళగిరి తిరునాళ్లగా వ్యవహరిస్తుంటారు. ఈ రథోత్సవం శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభం కానుంది. రథోత్సవానికి సుమారు లక్షన్నర మంది భక్తులు హాజరయ్యే అవకాశం వుందని అంచనా వేస్తున్నారు.





చంద్రప్రభ వాహనంపై పెండ్లికుమారునిగా నృసింహస్వామి, పుష్పక విమానంపై నూతన వధువులు శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు

ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత మాణిక్యవేల్ కన్నుమూత

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని వ్యాపార దిగ్గజాల్లో ఒకరైన ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ (76) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి గురువారం కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమిళనాడు నుంచి గుంటూరు వచ్చి నల్లచెరువులో స్థిరపడ్డారు. చిన్నపాటి సబ్బుల తయారీతో అంచలంచలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ట్రిపుల్ ఎక్స్ పేరుతో సబ్బులను తయారు చేసి తొలినాళ్ళలో కేవలం రూపాయితో సామాన్య ప్రజల్లోకి తన ఉత్పత్తులను తీసుకెళ్ళగలిగారు. ప్రస్తుతం ఆయన భారతీ కన్జూమర్స్ వర్క్స్ పేరుతో తన వ్యాపారాన్ని ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో విస్తరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించారు.



మాణిక్యవేల్ (ఫైల్ ఫోటో)

పలువురు నేతల నివాళులు.. సంతాపం

మాణిక్యవేల్ మృతికి పలువురు నేతలు సంతాపం తెలియజేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, గళ్ళా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు గుంటూరులో అంత్యక్రియలు

మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుంటూరు అరండల్‌పేట 10/1వ లైనులోని స్వగృహం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రజాభిప్రాయానికి భిన్నంగా గ్రామాల విలీనం

- అసెంబ్లీలో ప్రతిపాటి



చిలకలూరిపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి):మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం, రాష్ట్రంలో టెక్స్ టైల్ రంగ దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి సంబంధించిన జీవోపై రాష్ట్రంలో పలుచోట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని, గత ప్రభుత్వం అనాలోచితంగా, స్థానికుల అభిప్రాయాలకు, నిబంధనలకు విరుద్ధంగా విలీనప్రక్రియ చేపట్టిందని అన్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో కొన్ని గ్రామాలను నిబంధనలకు విరుద్ధంగా విలీనం చేశారని చెప్పారు. పసుమర్రు, మా నుకొండవారిపాలెం, గణపవరం గ్రామస్తులు విలీనాన్ని ఏకపక్షంగా తిరస్కరించారని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నట్టు చె ప్పారు. రాష్ట్రంలో కాటన్ అనుబంధ పరిశ్రమలకు పవర్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గుజరాత్, మధ్యప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, చత్తీస్గడ్ రాష్ట్రా లు పవర్ సబ్సిడీలు ఇస్తున్నాయని తెలిపారు. రెండు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను బతికించకపోతే ప్రభుత్వం నష్టపోతుందని అన్నారు. వెంటిలేటర్ పై ఉన్న టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన చెప్పారు. బయోమైనింగ్ పేరుతో చెత్త సేకరణ టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా డబ్బులు డ్రాచేసుకుని ప్రభుత్వా న్ని మోసగించిన జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆయన కోరారు. అమృత్ పథకం తొలిదశలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల్ని అమృత్-2లో పూర్తిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. వచ్చే ఏప్రిల్ నుంచి బిల్లుల చెల్లింపును నేరుగా మున్సిపాలిటీలే చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. ఈ నిర్ణయం వల్ల అభివృద్ధిపనులు వేగంగా జరుగుతాయని అన్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా తనిఖీలు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు పల్నాడు జిల్లాలలో ఎక్సైజ్ శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారని ఆ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో 'మామూళ్ల.. కిక్కు' అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎక్సైజ్ అధికారులు గుంటూరు, పల్నాడు జిల్లాలలో క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించారని తెలిపారు. రెండు జిల్లాలలోని 16 స్టేషన్లలో మొత్తం 24 డ్యూటీ పెయిడ్ మద్యం కేసులు నమోదు చేసి, 24 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 42.12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా ఓపెన్ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై 28 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేశామన్నారు. ఈ నెల 10వ తేదీన ఒక్కరోజే రెండు జిల్లాలలో ఓపెన్ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై 72 కేసులు నమోదు చేసి 72 మందిని అరెస్టు చేసినట్టు శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఉచితం.. అనుచితం

(3వ పేజీ తరువాయి)

దక్కాయి. దీంతో ఇక్కడ మూడు నుంచి ఐదు ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుకను నదిలోకి తీసుకెళ్లి లారీలకు నేరుగా తోడేస్తున్నారు. పరిమితికి మించి ఇసుకను లారీల్లో నింపుతున్నారు. ట్రక్కులో కాకుండా చివరకు డ్రైవర్ క్యాబిన్‌పైన కూడా కొండలా ఇసుకను నింపేస్తున్నారు. పరిమితికి మించిన ఇసుక లారీల నుంచి వంతెనలు, మలుపులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద జారిపోయి గుట్టలుగా పడిపోతోంది. దీంతో గాజుల్లంక-తెనాలి, గాజుల్లంక-రేపల్లె, కొల్లిపర-తెనాలి, కొల్లిపర-గుంటూరు, పెదకొండూరు-మంగళగిరి, విజయవాడ రోడ్లు ఇసుక మయంగా మారాయి. తెనాలి వైకుంఠపురం మార్గంలో రైల్వే ట్రాక్ వంతెనకు దిగువగా గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఓవర్ లోడుతో వస్తున్న లారీల్లోని ఇసుక వాటికి పట్టి కిందికి జారిపోతోంది. వంతెన వద్ద ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఈ వద్దే గడచిన పది రోజుల్లో 28కిపైగా ప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. రేపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ కుటుంబం జారి పడి తీవ్రంగా గాయపడిన తండ్రి, చిన్నారి ప్రస్తుతం గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే తరహాలో ఇద్దరు సచివాలయ ఉద్యోగినులు జారిపడ్డారు. అదే సమయంలో వెనుకగా వస్తున్న కంటైనర్ వెంటనే బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇదే తరహాలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా పరిమితికి మించి ఇసుకతో వస్తున్న లారీలపై నియంత్రణ లేకపోగా, కనీసం రోడ్డుపై పడిన ఇసుకను కూడా తొలగించడంలేదు. అటు ట్రాక్టర్లలోనూ ట్రక్కుకు మించి గోడుగా పోసుకొస్తున్న ఇసుక రోడ్లపైకి జారిపోతోంది.

కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నారు..

కూలీలతో ఇసుక లోడ్ చెయ్యాల్సిన రీచ్‌లలో కూలీలు ఎక్కడా కనిపించడంలేదు. ఉచిత ఇసుక విధానం వచ్చినప్పటి నుంచి అనుమతి పొందిన ఏ రీచ్‌లోనూ కూలీలు ఒకటి, రెండు రోజులు మినహా తర్వాత నేరుగా ఎక్స్‌కవేటర్లనే దింపేశారు. ప్రస్తుతం గాజుల్లంక, ఇతర రీచ్‌లలో ఎక్స్‌కవేటర్లే ఉంటున్నాయి. ఇటు ఉమ్మడి గుంటూరు జిల్లా, అటు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో గాజుల్లంక దగ్గర, పక్కనే శ్రీకాకుళం దగ్గర ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. బుధవారం పగలు, రాత్రి తేడా లేకుండా గాజుల్లంక రీచ్‌లో నాలుగు ఎక్స్‌కవేటర్లు, శ్రీకాకుళం రీచ్‌లో ఐదు ఎక్స్‌కవేటర్లు విరామం లేకుండా ఇసుక తవ్విపోస్తున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో దిబ్బలను తవ్వుతున్నారా అంటే అదీలేదు. నీరు ఉబికివచ్చేలా తవ్వేస్తున్నారు. రాత్రి వేళల్లో నీటితో నిండిన ఇసుకను వాహనాలకు నింపేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ నీటితో తడిచి బురదగా మారుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

(3వ పేజీ తరువాయి)

నదిపై మూడు కిలోమీటర్ల నిడివిలో నిర్మాణం జరగనున్నది. 2019 జనవరి 12న శంకుస్థాపన జరిగిన ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే అటు హైదరాబాద్, జగదల్‌పూర్ హైవేలను, ఇటు ఎన్-10 రోడ్డు ద్వారా అనంతపూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నేరుగా రాజధాని అమరావతితో కనెక్ట్ చేసి ఉండేది. కేవలం రాజధాని అమరావతి కోణంలోనే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల వారికి కూడా ఈ ప్రాజెక్టుతో పెద్ద మేలు జరిగి ఉండేది. ఈ బ్రిడ్జి కమ్ బ్యారేజి నిర్మాణం వలన మున్నేరు, వైరా వంటి ఉపనదులతోపాటు మరికొన్ని వాగుల నుంచి వచ్చే వరద జలాలను ఈ జలాశయంలో నిల్వ చేసే అవకాశం కలుగుతుంది. రమారమి 10 టీఎంసీలకు పైగా నిల్వ చేయవచ్చునని జలవనరులశాఖ అంచనా వేసింది. ఫలితంగా కృష్ణానది వెంబడి మళ్లీ త్వరితగతిన జరీభూములు ఏర్పడే అవకాశాలు మెరుగవుతాయి. అలాగే జలరవాణాకు మంచి అవకాశం ఏర్పడుతోంది. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. ఈ బ్యారేజి నుంచి రాజధాని అమరావతికి ఎత్తిపోతల సాయంతో రోజుకు 350 క్యూసెక్కుల నీటిని తరలించాలని కూడా నిర్ణయించారు.

16 నుంచి 26వ తేదీ వరకు పలు రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల కారణంగా 10 రోజుల పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబర్ 67769/67770 విజయవాడ - గుంటూరు - విజయవాడ రైళ్లను ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. అలానే నంబర్ 67775/67777 కాచిగూడ - మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నంబర్ 67778/67776 నడికుడి - మిర్యాలగూడ - కాచిగూడ రైళ్లను ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రద్దు చేశామన్నారు.

చర్లపల్లిలో మరికొన్ని రైళ్లకు నిలుపుదల సౌకర్యం

ఈ నెల 14వ తేదీ నుంచి నంబర్ 12705/12706 సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నంబర్ 17645/17646 సికింద్రాబాద్-రేపల్లె-సికింద్రాబాద్ సిరిపురంలో, నం.17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో, నంబర్ 20701/20702 సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మిర్యాలగూడలో నిలుపుదల సౌకర్యాన్ని కొనసాగించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

- విద్యార్థుల హర్షాతిరేకం.. హాస్టల్ విద్యార్థుల ఇంటిబాట

గుంటూరు(విద్య),మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ పరీక్షలు ఈనెల నుంచి ప్రారంభం అయిన విషయం తెలిసిందే పరీక్షలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు జిల్లా నుంచి 32వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే పరీక్షలు ముగియడంతో విద్యార్థిని విద్యార్థులు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. కేంద్రాల నుంచి కేకలు వేసుకుంటూ బయటకు వచ్చి తమవద్ద ఉన్న నోట్‌బుక్స్‌ను చింపి గాల్లో వేసి ఆనందం వ్యక్తం చేశారు. అనేక కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇదిలా ఉంటే హాస్టల్స్‌లో ఉండే విద్యార్థిని విద్యార్థులు గురువారం సాయంత్రమే ఇంటి బాట పట్టారు. కొన్ని హాస్టల్స్‌కు తల్లిదండ్రులు వచ్చి విద్యార్థుల్ని ఇళ్ళకు తీసుకెళ్ళారు.



పేపర్లు ఎగురవేస్తూ ఆనందంతో విద్యార్థులు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజుపాలెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అద్దంకి-నార్కెంట్‌పల్లి రహదారిపై మండల పరిధిలోని నెమలిపురి గ్రామ శివారు శ్రీనివాసనగర్ వద్ద జరిగింది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వడ్ల శ్రీను(21) నకరికల్లులో తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో ఈ నెల 12వ తేదీన అక్కడికి వెళ్లాడు. శుభకార్యం చూసుకుని తిరిగి తన స్వగ్రామమైన పిడుగురాళ్లకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని నెమలిపురి గ్రామ శివారు శ్రీనివాసనగర్ సమిపంలోకి వచ్చేసరికి ఇంకొల్లు నుండి హైదరాబాదు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో వడ్ల శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,41,244 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,28,725 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,41,244 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,214 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నంబరు 5	10000	14000
273	10000	13000
341	10500	14500
4884	--	--
సూపర్10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11000	12400
బ్యాడిగ 355	10000	14000
సింజెంటా బ్యాడిగ 5531	10500	12200
దేవనూరు డీలక్స్	11500	14000
ఆర్మూరు	10000	11000
నాన్ ఏసీ తాలుకాయలు	5000	7500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 30.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

వెల్దుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు సాయం అందిస్తోందని హౌసింగ్ ఏఈ దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, చెంచులకు రూ. లక్ష వరకు అదనంగా అందించనుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వే పరిశీలన

దుర్గి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న వివిధ సర్వేల పనితీరును గురజాల డీఎల్‌డీవో గబ్రూనాయక్ పరిశీలించారు. గురువారం మండలంలోని ధర్మవరం, ఓబులేశునిపల్లె, దుర్గి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం సచివాలయాలను సందర్శించి ఉద్యోగులతో సమావేశమై సర్వేల పనితీరుపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

24 గంటలు త్రీ ఫేజ్ కరెంట్

రెంటచింతల,మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పాలువాయి జంక్షన్,పాలువాయి గ్రామాల్లోని గృహ విద్యుత్ వినియోగదారులకు 24 గంటలు కరెంట్ సౌకర్యం వుంటుందని, ఈమేరకు చేసిన ఏర్పాట్లకు గురువారం ట్రయల్ నిర్వహించగా విజయవంతమైందని ఏపి ట్రాన్స్‌కో ఈఈ నూతలపాటి సింగయ్య తెలిపారు. గురువారం పాలువాయిసబ్ స్టేషన్‌లో వీసీబీ(వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్)కు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్‌వలి,ఎల్‌ఐ శ్రీనివాసాచారి,కాంట్రాక్టర్ బాబయ్య పాల్గొన్నారు.

సత్రశాలలో వసంతోత్సవం

రెంటచింతల,మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో గురువారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిభక్తులకు ప్రసాదాలు అందచేశారు. అలాగే వివిధ అన్న దాన సత్రాల్లో అన్నదానం కూడా చేపట్టారని ఈవో గాదె రామిరెడ్డి చెప్పారు.

హాస్టళ్లలో తనిఖీ

రెంటచింతల,మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రెంటచింతలలోని బీసీ బాలుర,బాలికల సంక్షేమ హాస్టళ్లను బీసీ సంక్షేమ సహాయాధికారి దయాకర్ గురువారం సందర్శించారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వార్డెన్ సుశీల తదితరులున్నారు.

ఆట వస్తువులు పంపిణీ

మాచర్ల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సీనియర్ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం రూ. 12 వేల విలువైన ఆట వస్తువులను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు గాదె కిరీటిరెడ్డి, జక్కిరెడ్డి మర్రెడ్డి, హెచ్‌ఎం విజయకుమారి, మోరా భాస్కరరెడ్డి, యరబోతుల శ్రీనివాసరావు, తుమ్మా ఆంథోనిరెడ్డి, శాంతిరెడ్డి, పాపిరెడ్డి, కర్తయ్య, జబ్బారు, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు వైద్యశిబిరం

మాచర్ల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు పీహెచ్‌సీ పరిధిలోని మంచికల్లు గ్రామంలో గురువారం చెంచులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పద్మావతి ఆధ్వర్యాన గర్భిణీలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, అమరేంద్ర, సాంబశివరావు, శాంతి, కుమారి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక చేయూత

సత్తెనపల్లిరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తర్వుల ప్రకారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం ద్వారా గృహాలు నిర్మించుకొనే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. గృహాలు నిర్మించుకొనే ఎస్సీ, బీసీలకు రూ 50వేలు, ఎస్టీలకు రూ 75వేలు అదనంగా ప్రభుత్వం అందజేయనుందన్నారు. గలబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ధరణికోట గ్రామపరిధిలోని ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహానికి పంచనామా నిర్వహించి అనంతరం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతి చెందిన వ్యక్తి మూడు రోజులుగా అమరావతిలో సంచరిస్తున్నాడని, హిందీ మాట్లాడుతున్నాడని స్థానికులు తెలిపారు. మృతుడి మెడలో పూసల దండ, ఒంటిపై గళ్ల చొక్క ఉంది. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.



మూగ జీవాలకు అందని వైద్యసేవలు



వేమవరం పశు వైద్యశాల

- గ్రామాలు 17.. పశువైద్యశాలలు మూడు
- ముగ్గురు డాక్టర్లకు గాను విధుల్లో ఇద్దరే..
- వైద్యం కోసం పశువులను తోలుకొని కిలో మీటర్ల ప్రయాణం..
- పశు వైద్యశాల నిర్మించాలని రైతుల వేడుకోలు

మాచవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు, మేకల సంపద మీద ఆధార పడి జీవించే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. వాటి ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రభుత్వాలు దృష్టి పెట్టక పోవటంతో పశు పోషకులు ఆవేదన చెందుతున్నారు. మాచవరం మండలంలో 17గ్రామాలకుగాను మండల కేంద్రమైన మాచవరం, వేమవరం, మోర్జంపాడు గ్రామాల్లోనే పశు వైద్యశాలలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. వేమవరంలోని వైద్యాధికారి ఇటీవల డిప్యూటేషన్‌పై జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని అతి పెద్ద గ్రామమైన పిన్నెలిలో పశువైద్యశాల లేకపోవటం విమర్శలకు తావిస్తుంది. ఈ గ్రామంలో అప్పటి మంత్రి కోడెల శివప్రసాదరావు పశువైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ అనంతరం పశు వైద్యశాలను నిర్మించింది లేదు. మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెలు, ఆవులు కలిపి సుమారు 12 వేలకుపైగా, మేకలు, గొర్రెలు 20 వేలకు పైగానే ఉంటాయని రైతులు తెలియ జేస్తున్నారు. వీటికి తోడు పెంపకం కోళ్ళు, కోళ్ళ ఫారాలూ ఉన్నాయి. పిల్లుట్ల, మల్లవోలు, కొత్తగణేశునిపాడు, శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా, సింగరాయపాలెం తండా గ్రామాలకు కలిపి పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల పరిధిలో పశు వైద్యశాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పిన్నెల్లి గ్రామంలోనూ పశు వైద్యశాలను నిర్మించాలని ఆయా ప్రాంతాల్లోని రైతులు కోరుతున్నారు.

ఏ గ్రామంలోనైనా పశువులకు వ్యాధులు వచ్చినపుడు రైతులు మాచవరం, మోర్జంపాడు పశు వైద్యశాలలకు తోలుకొని వెళ్ళాల్సివస్తోంది. వైద్యాధి కారులే ఆయా గ్రామాలకు వచ్చి వైద్యసేవలం దిం చాలంటే అక్కడ తగిన వసతులు ఉండటం లేదు. వేమవరం వైద్యాధికారిణి నరసరావుపేట డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించటం నిలిపివేసి వేమవరం వైద్యశాలకు తిరిగి పంపించాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

తక్షణమే పశు వైద్యశాల నిర్మించాలి

- యెలిశెట్టి నెమలయ్య, పిన్నెల్లి రైతు



మా గ్రామంలో సుమారు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు పశువులు, జీవాలు ఉంటాయి. పశువులకు ఏవైనా వ్యాధులు వచ్చినప్పుడు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న మాచవరం పశు వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామంలో తక్షణమే పశు వైద్యశాల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.



పిన్నెల్లిలో పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పశు సంపదపై ఆధారపడి జీవిస్తున్నాం..

- ఐడుగుల శ్రీను, పిల్లుట్ల రైతు



పిల్లుట్ల, మల్లవోలు, కొత్తగణేశునిపాడు, శ్రీ రుక్మిణీపురం గ్రామాల్లోని ప్రజలు ఎక్కువగా పశు సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల మధ్యలో పశు వైద్యశాల ఏర్పాటుచేస్తే ఆరు గ్రామాల రైతులకు ఎంతో ఉప యోగకరంగా ఉంటుంది.

అన్ని గ్రామాల్లో క్యాంపులు నిర్వహించాం

- మాచవరం పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల అన్ని గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశాం. మండలంలో ప్రస్తుతం ఇద్దరు పశు వైద్యులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ అన్ని గ్రామా ల్లోని పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

16న నాగమ్మ ఆలయంలో లింగాకార ప్రతిష్ఠ



నాయకురాలు నాగమ్మ దేవాలయం వద్ద మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

- టీటీడీ బోర్డు సభ్యుడు జంగా వెల్లడి
- ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలన

దాచేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పల్నాడుకే తల మానిక మైన నాయకురాలు నాగమ్మచే నిర్మించబడిన దేవాలయంలో ఈనెల 16న శివలింగాకారం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పల్నాడు మహా శైవ క్షేత్ర కార్యనిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి గురువారం తెలిపారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ప్రతిష్ఠకు సంబంధించిన శాంతియాగం, ఇతర పూజా కార్యక్రమాలు తాళాయపాలెం కోటిలింగాల క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ దేవస్థానం పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి అనేక మంది మఠ, పీఠ, ఆశ్రమాధిపతులు ముఖ్యులుగా హాజరు కానున్నట్టు తెలిపారు. అదే విధంగా టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి పల్నాడు ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ ప్రాంతంలో దేవాలయంతో పాటు గోశాల, వేద పాఠశాల, వృద్ధ, అనాథల ఆశ్రమాన్ని కూడా నిర్మిస్తున్నట్టు జంగా కృష్ణమూర్తి వివరించారు.

ఏఎన్‌ఎంలకు పంచాయతీ పనులు అప్పగించం

- ఎంపీడీవో గౌసియాబేగం.. ఆంధ్రజ్యోతికి స్పందన

గురజాలటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడితో ఏఎన్‌ఎంలు విసిగిపోతుండడంతో ఆంధ్రజ్యోతిలో బుధవారం సర్వే చేయాలా.. వైద్యం అందించాలా అనే శీర్షికన కథనం వెలువడడంతో అధికారులు స్పందించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో గౌసియాబేగం మాట్లాడుతూ ఇకపై ఏఎన్‌ఎంలకు పంచాయతీశాఖకు సంబంధించిన సర్వేల బాధ్యతలు అప్పగించబోమని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు

ఇరువర్గాలపై కేసులు

మాచర్లటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో బుధవారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో, ఇరువర్గాలకు చెందిన ఉప్పుతోళ్ల చెన్నకేశవరావు, మాచర్లబాబు ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలకు చెందిన 20 మందితోపాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు తెలిపారు. చెప్పారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పహారా నిర్వహిస్తున్నామని, పోలీసు పికెటింగ్ కొనసాగుతోందని, చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్లాస్టిక్ వినియోగం నిషేదం

- అతిక్రమిస్తే జరిమానా విధింపు
- మునిసిపల్ కమిషనర్ పి.శ్రీధర్ హెచ్చరిక

పిడుగురాళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వ్యాపారులు, దుకాణదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు 120 మైక్రాన్‌ల కన్నా తక్కువగా వున్న, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినట్లు కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో ప్లాస్టిక్ వాడకంను నిషేధించడమైనదని, దీనిని అతిక్రమించి విక్రయించినా, వాడుతున్నా వ్యాపారులకు, దుకాణదారులకు, తోపుడు బండ్ల వ్యాపారులకు 500 నుండి 25000 రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని కమిషనర్ శ్రీధర్ తెలిపారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలకు సిఫారసు

నకరికల్లు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సిఫార్స్ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఏ హీరాలాల్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో సర్వే పనులను పరిశీలించారు. రూపెనగుంట్ల, దేచవరం గ్రామాల్లో సర్వేలో వెనుకబడి ఉన్నట్టుగుర్తించి పంచాయతీ కార్యదర్శి దుర్గారావు తీరుపై అసహనం వ్యక్తంచేశారు. సచివాలయ ఉద్యోగులను, సర్వే నిర్వహించే విధంగా వ్యవహరించటంలో దుర్గారావు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు గుర్తించారు. మిగతా గ్రామాల్లో జరుగుతున్న సర్వే గురించి ఎంపీడీవో కాశయ్యతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు పాల్గొన్నారు.

పీఎస్ దుర్గారావుకు నోటీసులు.. పీ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూపెనగుంట్ల పీఎస్ దుర్గారావుకు ఎంపీడీవో నోటీసులు జారీ చేశారు. పలు మార్లు సర్వేను సక్రమంగా నిర్వహించాలని తెలియ జేసినప్పటికీ దుర్గారావు అలసత్వం ప్రదర్శించారని నోటీసులు పేర్కొన్నారు. తగు సంజాయిషి ఇవ్వక పోతే శాఖ పరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్స్ చేయనున్నట్టు ఎంపీడీవో నోటీసులో తెలిపారు.

వంతెన నిర్మాణ పనులు మొదలు

అచ్చంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ప్రజానీకానికి బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు కావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కృష్ణా నది పై 13 పిల్లర్స్ నిర్మించనున్నారు. విజయవాడకు చెందిన వల్లభనేని కన్‌స్ట్రక్షన్ పనులను మొదలు పెట్టింది. సుమారు రూ.60 కోట్లు నాబార్డు నిధులతో నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ఎన్‌టీఆర్ జిల్లా, అటు తెలంగాణా, ఇటు పల్నాడు జిల్లాలకు వాహన రాకపోకలకు అవకాశం కలుగుతుంది. దీని వల్ల మూడు జిల్లాల ప్రజానీకానికి ఎన్నో ఇబ్బందులు తొలగి పోనున్నాయి.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్

సత్తెనపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025 - 26 సంవత్సరానికి జరగాల్సిన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి జీ మార్కురావు గురువారం విడుదల చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో నామినేషన్‌లను దాఖలు చేయాలని, 19న దాఖలు చేసిన నామినేషనల్ పరిశీలన జరుగుతుందని, 20న నామినేషనల్ ఉప సంహరణ జరుగుతుందని, 21న పోటీల్లో ఉన్న వారి తుది జాబితా విడుదల చేస్తామని ఆయన తెలిపారు. 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బార్ అసోసియేషన్ హాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగటానికి అభ్యర్థులు, న్యాయవాదులు, సహకరించాలని కోరారు.

కవయిత్రి మొల్ల జయంతి

పిడుగురాళ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతి గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వర సాయి శాలివాహన కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఎదురుగా వున్న మొల్లమాంబ విగ్రహం వద్ద సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి గురుప్రసాద్ జ్యోతి వెలిగించారు. మున్సిపల్ చైర్మన్ కొత్త చిన సుబ్బారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్ అలి పలువురు పాల్గొని మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం 2 వేల మందికి అన్న దానం నిర్వహించారు.

ఒప్పిచర్లలో జిల్లా ఉప సంచాలకుడి పర్యటన

కారంపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లను గురువారం పశుసంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకుడు డాక్టర్ పి రామారావు సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు 350 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు అందించామన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల ఇన్‌చార్జి సహాయ సంచాలకుడు డాక్టర్ వెన్నా శ్రీనివాసరెడ్డి, కారంపూడి ఇన్‌చార్జి పశువైద్యాధికారి దిలీప్, కౌసర్, బ్రహ్మం పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు

కోసూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద గృహాలు మంజూరై అసంపూర్తిగా నిర్మాణం జరిగిన వాటికి నిధులు మంజూరైనట్లు క్రోసూరు ఎంపీడీవో జీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో మొత్తం 2,210 గృహాలు మంజూరు కాగా 780 గృహాలు ప్రారంభం కాలేదని, 904 గృహాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాల్సి ఉందని, బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నవి 378, లెంటిల్ లెవల్‌లో ఉన్నవి 15, రూఫ్ లెవల్ 70, రూఫ్ కాస్ట్ లెవల్ 63 ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, బీసీ లబ్ధి దారులకు రూ 50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ 70వేలు, ట్రైబల్ వెల్ఫేర్ లక్ష రూపాయలు ఇవ్వనున్నట్టు తెలిపారు. మండలంలో ఎస్సీ లబ్ధి దారులు 219 మంది, ఎస్టీ లబ్ధి దారులు 38 మంది, బీసీ లబ్ధి దారులు 184 మంది, మొత్తం 441 మంది ఉన్నారన్నారు. వీరికి దశల వారీగా వారి వారి ఎకౌంట్‌లలో నగదు జమ చేయబడుతుందన్నారు. ఈనిధులను జూన్ నెలాఖరు నాటికి ఉపయోగించు కోవాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించిన మొబైల్ అప్లికేషన్‌ను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ లోపు లబ్ధిదారునికి అదనపు నిధుల గురించి చెప్పి వారు నగదు మొత్తాన్ని ఉపయోగించుకొని ఇల్లు పూర్తి చేసుకోవటానికి ఉద్యోగులు సహకరించాలన్నారు. గృహాల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

సీతారామ్‌పై దాడిని ఖండిస్తూ న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : నూజివీడులో న్యాయవాది కొలుసు సీతారామ్ పై దాడిని ఖండిస్తూ అక్కడ పోలీసులు కేసు నమోదు చేయక పోవటాన్ని నిరశిస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కొలుసు సీతారామ్‌కు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యా దు చేసినా కేసు నమోదు చేయకపోవటం చట్ట విరుద్ధమన్నారు. వెంటనే కేసు నమోదు చేయాలని, ప్రభుత్వ న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో కంభాల అనీల్ కుమార్, మార్కురావు, ఎంవీ చలపతిరావు, దివ్వెల శ్రీనివాసరావు, నరిచేటి వేణుగోపాల్, గంగూరి అజయ్, పూదోట రాజు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేరీ సుజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు పేర్కొన్నారు. ఎటువంటి ఫీజులు లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు క్రోసూరులోని మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు. 10వ తరగతి మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు.

16న సీపీఐ శత వార్షికోత్సవం

- విజయవంతం చేయాలని పిలుపు

పెదకూరపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16వ తేదీన పెదకూరపాడులో సీపీఐ శత వార్షికోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి అన్నారు. పెదకూరపాడులో గురువారం సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్క రించుకొని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ నాయకులు, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే దర్శి లక్ష్మయ్య, సీపీఐ నాయకులు దర్శి పానకాలరావు, అంబటి హను మంతరావుల స్థూపాల వద్ద ఏర్పాట్లను చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ, నియోజక వర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పార్టీ నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపరెడ్డికి ఘన నివాళులు

అచ్చంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ళచెరువు గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నేత తుమ్మా చిన్నపరెడ్డి పది రోజుల క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మె ల్యే నంబూరు శంకరరావు గురువారం తాళ్ళ చెరువు లో తుమ్మా చిన్నపరెడ్డి చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈయనతో పాటు వైసీపీ మండల అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య, జడ్పీ టీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


అమ్మవార్లకు అభిషేకాలు

బెల్లంకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ ఊరి చివర ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి, అంకమ్మ తల్లి అమ్మవార్లకు గురువారం సాయంత్రం అభిషేకాలు చేశారు. గ్రామ మహిళలు భారీగా తరలివచ్చి అమ్మవార్లకు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోటేశ్వరమ్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు అండగా జనసేన జెండా

- జనసేన సత్తెనపల్లి నియోజక వర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు

సత్తెనపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జనసేన జెండా పేదలకు అండ అని జనసేన సత్తెనపల్లి నియోజక వర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద, వడ్డవల్లి పోలేరమ్మ అమ్మవారి గుడివద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన జెండా దిమ్మెలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభు త్వంలో జనసేన భాగస్వామ్యమై ప్రజాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. శుక్రవారం పిఠాపురంలో జరుగుతున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి 25 వాహనాల్లో పార్టీ నేతలు, కార్య కర్తలతో కలసి తరలి వెళ్తున్నట్టు ఆయన తెలిపారు. ముందుగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, జనసేన నాయకులు బత్తుల కేశవ, నామాల పుష్పలత, శ్రీనివాసరావు, నాదెండ్ల నాగేశ్వరరావు, శిరిగిరి పవన్, తాడువాయి లక్ష్మి, చిలకా పూర్ణ, తోట నాగేశ్వరరావు, గుండ్లపల్లి వెంకటేష్, రామకృష్ణ, రవీ, ఖాశిం తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని మునిసిపల్ ఏరియా వద్ద జనసేన జెండాను ఆవిష్కరించిన బొర్రా వెంకట అప్పారావు

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

దుర్గి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శ్రీతులసి ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ పరీక్షా సామగ్రిని గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎస్టీయూ నేతలు అనంతరామయ్య, హనుమంతురావు, శివానందకుమార్, విజయరాణి, కరీమ్, రవీంద్ర, శేఖర్, సతీష్, ప్రసాద్, అబ్బాస్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు

సత్తెనపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి గురువారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నూరు శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కే శ్రీనివాసరావు, బలిజేపల్లి విజయ కుమార్, గ్రామ పెద్దలు ఉన్నారు.

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మాచర్లటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిచిన జాబ్‌మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 118 మందిని ఇంటర్వ్యూ చేయగా 70 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉద్యోగ కల్పన కల్పన అధికారి రవీంద్రనాయక్, తమ్మాజీరావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కిరణ్‌నాయక్, సీడాప్ జాబ్స్ కోఆర్డినేటర్ నానినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయండి

మాచవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో వెంగళరావు ఆదేశించారు. గురువారం మండలంలో వేమవరం, తురకపాలెం, మాచవరం తదితర గ్రామాల్లో జరుగుతున్న పీ-4, వర్క్ ఫ్రం హోమ్ సర్వేలను ఆయన స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియజేశారు. రెండు రోజుల్లో రెండు సర్వేలు నూటికి నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే మెమోలు ఇవ్వటమే కాకుండా జిల్లా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది ఈ సర్వేల పై శ్రద్ధ పెట్టి నూటికి నూరు శాతం పూర్తి చేయాలని తెలియ జేశారు.

స్థలం వివాదంలో ఘర్షణ .. ఒకరికి తీవ్ర గాయాలు

బెల్లంకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గురువారం ఇళ్ళ స్థలాల వద్ద మేరువ తోలించుకొనే క్రమంలో అన్నదమ్ములు ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో గోళ్ళమూడి గోపీ, ఆది గోపీ, ఆది కోటయ్య వీరితో పాటు మరో ఇరువురు తనపై దాడి చేసి గాయ పరిచినట్టు క్షతగాత్రుడు భద్రయ్య తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది క్షత గాత్రుడిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పది విద్యార్థులకు ఉచిత రవాణా: మధు

నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు వారి నివాసం నుంచి పరీక్షా కేంద్రానికి చేరడానికి విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు గురువారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు జరిగే ఈ నెల 31, ఏప్రిల్ 1 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయం గమనించి ఈ సదుపాయంను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిపక్ష హోదాలేని వ్యక్తిగా జగన్ మిగిలిపోతాడు: ధారునాయక్

నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష హోదాలేని వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిపోతారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధారునాయక్ మాట్లాడుతూ 2019లో ప్రజలు ఒక్క చాన్స్ ఇస్తే, 2024లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఇంట్లో కూర్చునేలా అద్భుతమైన తీర్పు ఇచ్చారన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ నాయక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

వినుకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్మీకంపోస్టు తయారీ చేసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మోడల్ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచర్ల, మార్చి 13 (ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రినిపాల్ రవి నాయక్ గురువారం తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి మే నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెలాఖరుకు గడువు ముగుస్తుందన్నారు. వివరాలకు 9701030357ను సంప్రదించాలని కోరారు.

సింగరకొండ తిరునాళ్ళకు నరసరావుపేట నుంచి ప్రత్యేక బస్సులు

నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డిపో నుంచి ఈ నెల 14న జరగనున్న సింగరకొండ తిరునాళ్ళకు ప్రత్యేక బస్సులు నిర్వహిస్తామని డీఎం బీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 12 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. అడ్డరోడ్డు, ఏల్చూరు, కొమ్మాలపాడు మీదగా సింగరకొండకు బస్సులు వెళ్ళతాయన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

వినుకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ గురువారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, వినుకొండ మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

నరసరావుపేట లీగల్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సెల్ ఫోన్లను పోలీసులు సాంకేతిక సహాయంతో రికవరీచేసి గురువారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత యజమానులకు అందజేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సుమారు 31.22 లక్షల విలువైన రెండు వందల ఇరవై మూడు ఫోన్లను రికవరీ యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, గురజాల డీఎస్పీ జగదీష్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాల బీకామ్ విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలకు 15మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో టీసీఎస్ కంపెనీ బీకాం విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా ఇందులో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 15మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను టీపీవో ఎం. బాలకోటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, జి.శివన్నారాయణ, అధ్యాపకులు అభినందించారు.

నార్కోటిక్స్ దుష్ఫలితాలపై అవగాహన

నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ వినియోగం, వాటి దుష్ఫలితాలపై అవగాహన సదస్సు జరిగినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసేవారు యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుంటారని దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాససాయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కేంద్రనాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయన్నారు. సదస్సును ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు టీడీ శంకరరెడ్డి, డాక్టర్ సరళాదేవి, ఆర్ వేణుమాధవ్, పీ శ్రీనివాసులు నిర్వహించారు.

సహకార సొసైటీల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీల్లో కంప్యూటరీకరణను 20తేదీకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లాలోని 59 సంఘాలు ఈ సంఘాలుగా మార్చాలని ఈ అంశంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా సహకార ఐదో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సర కాలంగా సంఘాల కంప్యూటరీకరణలో పురోగతి సరిగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిగా పనిచేయని సంఘ సీఈవోలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని జిల్లా సహకార అధికారిని ప్రశ్నించారు. కంప్యూటరీకరణ పూర్తిచేసే విషయంలో పని చేయని వారిపై 21న చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కామన్ సర్వీస్ సెంటర్లుగా అన్ని సేవలు రైతులకు అందజేయాలని సూచించారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు సీఎస్‌సీ సెంటర్లను సిద్ధం చేయాలన్నారు. ఈపూరు, పాకాలపాడు సంఘాల్లో కోల్డ్ స్టోరేజిల నిర్మాణానికి అన్నిస్థాయిలలో అనుమతులు పొంది త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంఘాల పరిధిలో ఉన్న మల్టీపర్పస్ గోడౌన్లను ఖాళీగా ఉంచకుండా పంటలు నిల్వ చేసుకునేందుకు గోదాముల సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు. 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటుకు ఆమోదిస్తూ, సంబంధిత ఏరియా మేనేజర్లతో సమావేశమై తదుపరి సమావేశం నాటికి పురోగతి చూపాలని కోరారు. అవసరమైన చోట మల్టీపర్పస్ గోడౌన్లను గ్యాస్ గోడౌన్లుగా మార్పు చేసేందుకు ఆమోదం తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఎన్‌పీఏ వసూళ్ల ఈ నెలాఖరుకు 80 శాతం, జూన్ నాటికి నూరు శాతం వసూలు పూర్తి చేయాలని బ్యాంక్ సీఈవోను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025

ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరంను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, దాని ప్రకారం మార్చి నుంచి డిసెంబరు వరకు చేపట్టవలసిన వివిధ కార్యక్రమాలను సమావేశంలో ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో విధిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, నాబార్డ్ డీడీఎం శరత్ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హీరాలాల్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కాంతారావు, జిల్లా మత్స్య శాఖాధికారి సంజీవరావు, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో, కృష్ణవేణి, నరసరావుపేట డివిషనల్ సహకార అధికారి నాగశ్రీనివాస్, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

17నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం

● 9552300009 వాట్సాప్ నంబరు నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడు చేసుకోండి ● డీఈవో చంద్రకళ



నరసరావుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని డీఈవో ఎల్ చంద్రకళ అన్నారు. గురువారం నరసరావుపేటలోని డీఈవో కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ ఈ ఏడాది 2024-25లో పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 463 పాఠశాలల నుంచి 26,497మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షలు మార్చి 31 లేదా ఏప్రిల్ 1వరకు, ఎందుకంటే రంజాన్ 31న వస్తే ఏప్రిల్ 1, ఏప్రిల్ 1న రంజాన్ వస్తే 31న పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా 128 పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని, 13,415 బాలురు, 13,088 బాలికలు పరీక్షలకు హాజరు అవుతారన్నారు. 128 పరీక్షా కేంద్రాలలో 68 ప్రైవేట్ సెంటర్‌లను గుర్తించామన్నారు. 60 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులందరూ హాల్ టికెట్లను 9552300009 వాట్సఆప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఒక రోజు ముందగానే పరీక్షా కేంద్రంను చూసుకుంటే మంచిదన్నారు. ఏపీఎస్ ఆర్టీసీలో విద్యార్థులు హాల్‌టికెట్‌తో ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చన్నారు. ఓపెన్ పదో తరగతి పరీక్షలు పల్నాడు జిల్లాలో 17వ తారీకునే 1200 విద్యార్థులు రాస్తారన్నారు. ఇది కూడా రెగ్యులర్ సెంటర్‌లలో ప్రత్యేకంగా దీనికి కూడా ఒక చీఫ్, డిపార్టుమెంట్ ఆఫీసర్, సిట్టింగ్ స్క్వాడ్‌ను వేయడం జరిగిందన్నారు. 27 కేంద్రాలలో ఈ 1200 మంది విద్యార్థులు పల్నాడు జిల్లాలో పరీక్షలు రాస్తారన్నారు. ఎస్‌బీఆర్ నరరరావుపేట మునిసిపల్ పాఠశాల, రొంపిచర్ల మండలంలోని విపర్లరెడ్డిపాలెం, విజయపురిసౌత్ ప్రభుత్వ పాఠశాల, బొల్లాపల్లి మండలం బండ్లమోడు జెడ్‌పీహెచ్ఎస్, క్రోసూరు జెడ్‌పీహెచ్ఎస్, కారంపూడి పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన 8341135357కు అదనపు సమాచారం కావాల్సిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంప్రదించాలన్నారు.

వైసీపీ మద్యం కుంభకోణంపై ఈడీ విచారణకు ఆదేశించాలి

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాశిరకం మద్యంతో జగన్‌రెడ్డి 33వేల మంది మృతికి కారకుడయ్యాడని, నాశిరకం మద్యం అవినీతిపై సీబీడీ, ఈడీ విచారణ జరపాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం అసెంబ్లీలో స్పీకర్‌ను కోరారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నాశిరకం మద్యాన్ని సరఫరాచేసి ప్రజారోగ్యంతో చెలగాట మాడి వ్యాపారం చేసుకున్నాడని ఆరోపించారు. 40 లక్షలమంది అనారోగ్యం పాలైతే 33వేల మంది ప్రాణాలు కోల్పోయారనే గణంకాలను స్పీకర్ దృష్టికి తెచ్చారు. ఢిల్లీలో జరిగిన మద్యం కుంభకోణం కంటే పది రెట్లు జగన్‌రెడ్డి హయాంలో జరిగిందని, సమగ్ర విచారణ జరిపి మద్యం కుంభకోణాన్ని వెలికితీసి కారకులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. డిజిటల్ లావాదేవీలు అనుమతించకుండా తాడేపల్లి ప్యాలెస్‌లోకి గుట్టలుగా బ్లాక్ మనీ పోగు చేసుకున్నారని వాటిని లెక్కపెట్టడానికి రోజుకు 29కౌంటింగ్ యంత్రాలు, 200మంది సిబ్బంది పనిచేసే వారని ఆరోపించారు. జే బ్రాండ్‌లు మద్యం ప్రాణాంతకమని పక్క రాష్ట్రాలు ఏపీ బ్రాండ్‌లను నిషేధించిన దుస్థితి తెచ్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మార్చుతున్నామన్నారు. 90శాతం వరకు బెల్టుషాపులను కట్టడి చేసినట్లు తెలిపారు. నూతన మద్యం విధానంలో 20 శాతం కమిషన్ వస్తుందని టెండర్లు వేసిన వారంతా ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారని ఆ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. గీత కార్మికులకు పది శాతం కోటాతో 349 మద్యం దుకాణాలు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

కరాటే క్రీడాకారుడు రామినేని రోహన్‌కు సీఎం సత్కారం



అంతర్జాతీయ కరాటే చాంపియన్ రోహన్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, పక్కన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దక్షిణాఫ్రికా రాజధాని డర్బన్ వేదికగా జరిగిన కామన్ వెల్త్ 11వ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పల్నాడు జిల్లా వినుకొండ మండలం పెద కంచర్ల గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు రామినేని రోహన్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గురువారం పరిచయం చేశారు. అనంతరం విద్యార్థి సాధించిన చాంపియన్ షిప్ సర్టిఫికెట్లు, ప్రతిభను చూసి చంద్రబాబు అభినందించి ఏనుగు ప్రతిమను బహుమతిగా అందజేశారు. సీఎంను కలిసిన వారిలో రోహన్ తండ్రి రామినేని శివకృష్ణ, తాత రామినేని రామకోటయ్య, పెద్దనాన్నలు రామినేని పూర్ణచంద్రరావు, రామినేని సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీలో రికవరీకి పీడీ ఆదేశం

వినుకొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో షుట్టారెడ్డి ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన 757 పనులకు రూ.13,42,72,327 విలువైన పనులపై ఎస్ఆర్‌పీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేపట్టారు. గత వారం రోజులుగా సామాజిక తనిఖీ చేపట్టి గురువారం ప్రజావేదిక కార్యక్రమంలో రూ.15,92,779లు అవినీతిని వెలికితీశారు. మొత్తం రూ.4,00,858 రికవరీ చేయాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ఆదేశించారు. మరో రూ.58,776లకు వివిధ గ్రామాల్లో ఎంక్వయిరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏపీఎం విజయలక్ష్మి, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు, ఎస్ఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

మిర్చి పంటపై రైతులకు అవగాహన

బొల్లాపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లో గురువారం వినుకొండ ఉద్యానవన శాఖ అధికారి షేక్ నబీ రసుల్లా ఆధ్వర్యంలో మిరప పంటలను తెగుళ్ళు, కోత అనంతరం పాటించాల్సిన పద్ధతుల గురించి రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగమేశ్వరంనకు చెందిన వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ వీ సైదా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిర్చి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. తామర పురుగు నివారణ, మిరపలో వైరెస్ తెగులు, మిరప కాయలు కోసిన తరువాత వాటిపై రైతుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షేక్ నబీ రసుల్లా, ఎం.గురునాథం, రామబ్రహ్మం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మూత్రపిండాల రక్షణకు ముందస్తు పరీక్షలు అవసరం

● డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు

నరసరావుపేట లీగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు గురువారం ప్రజలకు అవగాహన కలిగిస్తూ సంబంధిత సమాచారంతో ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూత్రపిండాల వ్యాధుల నుంచి ప్రజలు రక్షించడానికి ముందస్తు పరీక్షలు చాలా అవసరం అన్నారు. కిడ్నీ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా వేలాది మందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగులు అందించగలిగామని తెలిపారు.

జాబ్‌మేళాలో 24మంది ఎంపిక

నరసరావుపేట కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఆదేశాల మేరకు లింగంగుంట్లలోని స్థానిక న్యాక్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాలో నాలుగు కంపెనీలు హాజరు కాగా 49మంది నిరుద్యోగులు హాజరయ్యారని, వారిలో 24మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు.

డ్రోన్‌లతో నాటుసారాపై నిఘా

నరసరావుపేట లీగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నాటుసార తయారీపై నిఘాకోసం డ్రోన్లను వినియోగించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం అధికారులను ఆదేశించారు. నాటు సారా తయారీ, రవాణా, వినియోగాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నవోదయం 2.0 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీని లక్ష్యంగా చేసుకోవడంతో పాటు నాటుసారా వినియోగం వల్ల ఆరోగ్యపరంగా సంభవించే నష్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల సాయంతో సారా తయారీలో నిమగ్నమైనవారికి ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలు చూపించాలన్నారు. నాటుసారా తయారీ, వినియోగాలను నిరసిస్తూ నవోదయం 2.0 పోస్టరు విడుదల చేశారు.

భూ సేకరణకు రెవెన్యూ సిబ్బంది సిద్ధం కావాలి

● జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే



శావల్యాపురంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే

శావల్యాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నుంచి గుంటూరు వరకు చేపట్టనున్న జాతీయ రహదారి 544 డీఏకు త్వరలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనున్నందున రెవెన్యూ సిబ్బంది భూసేకరణకు సిద్ధం కావాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారికి రైతుల నుంచి భూములు సేకరించాల్సిన తీరుపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. అనంతరం రూట్‌మ్యాప్ గురించి తహసీల్దార్ సురేష్, సర్వేయర్ రాజు జేసీకి తెలిపారు. కార్యక్రమంలో జాతీయ రహదారి అసిస్టెంట్ ఇంజినీర్ ఆశోక్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాసరయ్య, వీఆర్వోలు మంగయ్య, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 15 సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేయాలి: ఎంపీడీవో

నూజెండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో 15 సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేపట్టేలా బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో సీ ఉమాదేవి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సేద్యపు నీటి కుంటలపై రైతులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు భాస్కర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో విద్యుత్ అదాలత్

చిలకలూరిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్బయ్యతోటలో విజయవాడ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక వారి ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 10మంది విద్యుత్ వినియోగదారులు న్యాయపరిష్కారం కోసం దరఖాస్తు చేశారు. వాటిలో కొన్ని సత్వరమే న్యాయపరిష్కారం చేశారు. మరికొన్నింటికి 30రోజులు లోపు పరిష్కారం చేయాలని ఛైర్మన్, జిల్లా న్యాయమూర్తి ఎస్.విక్టర్ ఇమ్మానియేలు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట, గుంటూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గణాంక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటలు, ఇంకుడు గుంతలపై ప్రత్యేక దృష్టి: డ్వామా పీడీ

శావల్యాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పరిరక్షణ కోసం ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులకు సంబందించిన రికార్డులను ఆయన గురువారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత జనవరి 15వ తేదీ వరకు ఉపాధి హామీ కూలీలకు రావసిన వేతనాలను రెండ్రోజుల వ్యవధిలో జమవుతాయన్నారు. ఉపాధి హామీ అధికారులు పని ప్రదేశాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు మొబైల్ యాప్‌లో నమోదు చేసే కూలీల ఫొటోలను క్షుణ్ణంగా పరిశీలించాకే హాజరు వేయాలని, హాజరు విషయంలో అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో కటారపు రామారావు, టీఏ బేబీరోజ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాలకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం కవయిత్రి మొల్ల: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల జీవితం యువతకు ఆదర్శం అని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొల్ల జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తొలుత మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కేవలం ఐదు రోజులలో రామాయణాన్ని సరళమైన భాషలో రచించిన ప్రతిభాశాలి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఇతర వెనుకబడిన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

నరసరావుపేట రూరల్ మార్చి 13: (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి నివాళుల్పపంచారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వేముల శివ, రాజారపు శ్రీనివాసరావు, గుమ్మడిదల శివకుమార్, కందుకూరి అశోక్, బి.శ్రీనివాసరావు, బండి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

నరసరావుపేట కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఇండోర్ కాంప్లెక్సుకు గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శంకుస్థాపన చేశారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా రూ.4.50లక్షలతో ఈ కాంప్లెక్సును నిర్మించనున్నారు. ఇండోర్ కాంప్లెక్సు నిర్మాణం క్రీడాభివృద్ధికి తోడ్పడుతుందని కలెక్టర్, ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బారాయుడు, తహసీల్దార్ వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

చందవరం పంచాయతీలో నిధుల దుర్వినియోగం

● ఆరుగురు కార్యదర్శులు, విశ్రాంత ఈవోపీఆర్‌డీకి షోకాజ్ నోటీసులు

నాదెండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన ఆరుగురితో పాటు నాదెండ్ల ఈవోపీఆర్‌డీగా పనిచేసిన మరొకరికి జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2014 నుంచి కార్యదర్శులుగా పని చేసిన పలువురు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని, నీటి పన్నును వసూలు చేయకుండా నష్టపరిచినందున విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోకాయుక్తతో పాటు పీజీఆర్ఎస్‌లో గ్రామానికి చెందిన యన్నం రమణారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీంతో డివిజనల్ పంచాయతీ అధికారి గడిచిన డిసెంబరులో గ్రామ పంచాయతీలో విచారణ జరిపి పిటిషన్‌తో పాటు కార్యదర్శిగా పనిచేసిన జే జెరీనా, జీఎల్ కాంతారావు, షేక్ షాహిద తదితరుల వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. డీఎల్‌పీవో ఇచ్చిన నివేదిక ప్రకారం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన జే జెరీనా, జీఎల్ కాంతారావు, తెనాలి వెంకటేశ్వర్లు, షక్ షాహిద , జే రామకోటయ్య, మారుతీ బాబు, నాదెండ్ల ఈవోపీఆర్‌డీగా పని.చేసిన ఎం.మోషేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21వ తేదీన జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

మహిళల భద్రతకు శక్తి యాప్: ఎస్పీ

నరసరావుపేట లీగల్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు శక్తి యాప్ ఒక రక్షణ కవచం లాంటిదని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిఒక్క మహిళ ఫోన్లో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందవచ్చు అన్నారు. ఆపద సమయంలో మహిళలు ఎవరైనా ఎస్ఓఎస్ బటన్ ప్రెస్‌చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 నెంబరుకు చేరుతుందన్నారు. ముందుగా ఫోన్లో ఉన్న గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన శక్తి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, డీఎస్పీ జగదీష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి, మహిళా ఎస్ఐలు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పూలలొద్ది ప్రసన్నాంజనేయస్వామి, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వైభవంగా పూలలొద్ది ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ

యడ్లపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ పరిధిలోని పూలలొద్ది ప్రసన్నాంజనేయస్వామి 41వ వార్షిక తిరునాళ్ళ గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పొంగించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు అన్నదానం జరిగింది. సొలస గ్రామ నుంచి రెండు, సంకురాత్రిపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల నుంచి ఒక్కో విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. కాగా చిన్నారులు మినీ ప్రభలతో ఊరేగింపుగా తిరునాళ్ళకు తరలివచ్చారు.

పది పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లపై ఎంఈవో పరిశీలన

శావల్యాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పది పరీక్షా కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని ఐదు జడ్పీపాఠశాలల నుంచి మొత్తం 270మంది విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నారని, పరీక్షల నిర్వహణకు 15 తరగతి గదులు కేటాయిచామన్నారు. అనంతరం పాఠశాల్లోని 77మంది పది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, సుభాష్‌చంద్రారెడ్డి, భువనేశ్వరి, నిర్మల, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి: నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆందోళన లేకుండా పది పరీక్షలు రాయాలని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన 10వ తరగతి విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో హెచ్ఎం ఎం.సుందరరావు, వై.శివారెడ్డి పాల్గొన్నారు.